epaper : tmedia.net.in

GSTIN-NO:36FDKPS1308P1ZX , Regd. No. 100/20

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్ : గురువారం - సెప్టెంబర్ 14-2023 పేజీలు : 2

## 20న ఎపి కేబినెట్ భేటీ

**టి మీడియా,సెప్టెంబర్ 13, విజయవాడ :**



ఈ నెల 20వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ భేటీ కానుంది. ఈ సమావేశంలో కీలక అంశాలపై మంత్రి మండలి నిర్ణయం తీసుకోనుంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చించనుంది. ఈ నెల 21 నుంచి ఎపి అసెంబ్లీ సమావేశాలు ఐదు రోజులపాటు జరగనున్నట్లు ప్రాథమిక సమాచారం. అవసరాన్ని బట్టి మరో రెండు రోజులు పెంచే అవకాశముందని తెలుస్తుంది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లును ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నట్టు సమాచారం. ఇవే కాకుండా కొన్ని ఆర్డినెన్సులకు సంబంధించిన బిల్లులు, మరికొన్ని కొత్త బిల్లులను సమావేశాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

# ఉగ్రవాదుల ఘాతుకం

## కాల్పుల్లో ముగ్గురు వీరమరణం

**టీ మీడియా, సెప్టెంబర్ 13,అనంత్‌నాగర్ :**

కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఘాతుకానికి పాల్పడ్డారు. అనంత్‌నాగర్ జిల్లా కోకర్‌నాగర్ ప్రాంతంలో ఉగ్రవాదులతో బుధవారం ఉగ్రవాదులు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఆర్మీ కల్నల్ మన్‌ప్రీత్ సింగ్, మేజర్ ఆశిష్, జమ్మూ కశ్మీర్ పోలీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ హుమాయున్ భట్ తీవ్రంగా గాయపడి, ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు. డీఎస్పీ హుమాయున్ భట్ తీవ్ర గాయాలతో రక్తస్రావం కావడంతో



తుదిశ్వాస విడిచారు. అలాగే జవాన్ రవి సైతం ప్రాణాలు విడిచారు. అదే సమయంలో భద్రతా బలగాలు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు సైతం హతమయ్యారని అధికార వర్గాలు తెలిపాయి. అయితే, అనంత్‌నాగ్ జిల్లా రాజౌరి ప్రాంతంలో ఉగ్రవాదుల గురించి సమాచారం అందుకున్న బలగాలు.. తనిఖీలు చేపట్టాయి. ఈ క్రమంలో ఎదురుకాల్పులు జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం ఇంకా ఎదురుకాల్పులు జరుగుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇంకా మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## కాంగ్రెస్‌లోకి షర్మిల

- 15న ముహూర్తం ,ఖరారు..!

**టి మీడియా, సెప్టెంబర్ 13,హైదరాబాద్ :**



వైఎస్సార్ తెలంగాణ పార్టీ పెట్టి తెలంగాణ రాజకీయాల్లో కేసిఆర్ ప్రభుత్వంపై విరుచుకుపడుతున్న షర్మిల..పార్టీని విలీనం చేస్తూ..ఆమె కాంగ్రెస్ లో చేరడం ఖాయమైంది. ఇప్పటికే షర్మిల..రాహుల్ గాంధీ, సోనియాలతో భేటీ అయ్యారు. కాంగ్రెస్‌లోకి వెళ్ళేందుకు సిద్ధమయ్యారు. అయితే ఆమె కాంగ్రెస్‌లోకి ఎప్పుడు వెళ్తారనేది చర్చగా మారింది. ఈ క్రమంలోనే సెప్టెంబర్ 16, 17 తేదీల్లో కాంగ్రెస్ అగ్రనేతలు హైదరాబాద్‌కు వస్తున్నారు. 16న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఇక 17న తెలంగాణ విమోచనదినోత్సవం సందర్భంగా భారీ సభ జరగనుంది. అయితే షర్మిల 15న కాంగ్రెస్ లో చేరనున్నారని తెలిసింది. 15 సాయంత్రం సోనియా, రాహుల్ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు అప్పుడు షర్మిల కాంగ్రెస్ లోకి వెళ్తారని తెలిసింది. అయితే దీనిపై అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. మొత్తానికైతే షర్మిల కాంగ్రెస్ లో చేరడం ఖాయం. ఇక షర్మిల కాంగ్రెస్ లోకి వస్తే ఆమె స్థానం ఏంటి అనేది క్లారిటీ లేదు. పైగా ఆమె ఎక్కడ నుంచి పోటీ చేస్తుందనేది క్లారిటీ లేదు. ఇప్పటికే ఆమె పాలేరు నుంచి పోటీ చేస్తానని ప్రకటించారు. కానీ అక్కడ తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ లోకి వస్తున్నారు. దీంతో సీటు ఆయనకే దక్కే ఛాన్స్ ఉంది. ఒకవేళ షర్మిల తెలంగాణ ఎన్నికల బరిలో ఉంటే..ఆంధ్రా పెత్తనం అంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేసి..కాంగ్రెస్‌కి డ్యామేజ్ చేయవచ్చు అనేది తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్‌ని కేవిపి రామచంద్రరావు నడిపిస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. ఇప్పుడు షర్మిల తెలంగాణ రాజకీయాల్లో ఉంటే కాంగ్రెస్‌కు నష్టం. అందుకే ఆమెకి జాతీయ స్థాయిలో కీలక పదవి ఇస్తారని అంటున్నారు.

## రాజకీయాలు ఎన్నికలప్పుడు చేసుకోవచ్చు

- మంత్రి కల్వకుంట్ల తారకరామారావు

**టీ మీడియా, సెప్టెంబర్ 13,సంగారెడ్డి :**



రాజకీయాలు ఎప్పుడూ ఉంటాయని.. వాటిని ఎన్నికలప్పుడు చేసుకోవచ్చని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. సంగారెడ్డి జిల్లాలో మోనిన్ పరిశ్రమకు కేటీఆర్ భూమిపూజ చేశారు. దేశంలోనే మొదటి యూనిట్‌ను సంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేస్తున్న మోనిన్ సంస్థ.. రూ.300 కోట్లకుపైగా పెట్టుబడితో 40ఎకరాల విస్తీర్ణంలో పరిశ్రమ ఏర్పాటు చేస్తున్నది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పరిశ్రమలు వచ్చినప్పుడు అందరూ సహకరించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమలకు సింగిల్ విండో తీసుకువచ్చిందని తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పరిశ్రమలకు ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. స్థానిక యువతకు ఉద్యోగం కల్పించేందుకు సీఎం కేసీఆర్ కషి చేస్తున్నాం న్నారు. పరిశ్రమ ఏర్పాటుతో ప్రత్యక్షంగా.. పరోక్షంగా 400 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు మీ ప్రాంతాల్లో పరిశ్రమ వస్తే సహకరించాలని కోరారు. కొంతమంది రాజకీయాలు చేస్తారని, నిజానిజాలు తెలుసుకోవాలని, ఎవరు పరిశ్రమ పెట్టినా కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ మారిందన్నారు. భారతదేశానికే అన్నం పెట్టే స్థాయికి తెలంగాణ ఎదిగిందని.. తెలంగాణలో ఐదురకాల విప్లవాలు ఆవిష్కృతమవుతాయని కేటీఆర్ పేర్కొన్నారు.

## యాజమాన్యం వేధింపులపై రాష్ట్రపతికి లేఖ రాసిన జెఎన్‌యు ప్రొఫెసర్

**టి మీడియా ,సెప్టెంబర్ 13,న్యూఢిల్లీ :**

యూనివర్శిటీ యాజమాన్యం తనను వేధిస్తోందంటూ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ (జెఎన్‌యు) ప్రొఫెసర్ రాజీవ్ కుమార్ రాష్ట్రపతికి లేఖ రాశారు. తనపై దాఖలైన దుష్ప్రవర్తన ఫిర్యాదుతో గత 42 నెలలుగా యాజమాన్యం వేధింపులకు గురిచేస్తోందంటూ లేఖలో పేర్కొన్నారు. ఈ తరహా కేసుల్లో నెలలోపు విచారణ పూర్తి చేయాలని యూనివర్శిటీ నిబంధనలు ఉన్నప్పటికీ.. 2020 ఫిబ్రవరి నుండి విచారణ పెండింగ్‌లోనే ఉంది. యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ కంప్యూటర్ అండ్ సిస్టమ్స్ సైన్సెస్‌లో అధ్యాపక సభ్యుడు, ప్రొఫెసర్ రాజీవ్ తనపై పెండింగ్‌లో ఉన్న విచారణను పేర్కొంటూ తన పదవీ విరమణ అనంతర ప్రయోజనాలను నిలిపివేస్తారని భయపడుతున్నారు. రాజీవ్ కుమార్ 2024 మార్చిలో రిటైర్ కానున్నారు. 2006లో ఐఐటి ఖరగ్‌పూర్‌లో తన పదవీకాలంలో ఆర్థిక మరియు విధానపరమైన అక్రమాలను వెలికితీసి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీ నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (జెఇఇ)లో పారదర్శకతను తీసుకురావడానికి ఆయన చేసిన కషికి గాను సుప్రీంకోర్టు "గుర్తింపు కోరని హీరో" అంటూ ప్రశంసలు కురిపించింది. ప్రస్తుత యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) చైర్మన్ ఎం. జగదీష్ కుమార్ 2015లో జెఎన్‌యు వైస్‌ఛాన్సలర్‌గా ఉన్న సమయంలోనే ప్రొఫెసర్ రాజీవ్



కుమార్ అక్కడ చేరారు. 2020లో విచారణకు ఆదేశించగా, జగదీష్ కుమార్ (2016-22) పదవీకాలం పూర్తయినా విచారణ కొనసాగుతుండటం గమనార్హం. 2006లో జెఇఇలో అక్రమాలను వెలికితీసినందుకు జగదీష్ కుమార్ తనను లక్ష్యంగా చేసుకున్నారని ఆ లేఖలో పేర్కొన్నారు. గతేడాది జనవరిలో ఆయన పదవీవిరమణ చేసినప్పటికీ.. తనపై వేధింపులు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు.

2020 జనవరిలో జరిగిన బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశంలో ఇద్దరు ఎక్స్‌టర్నల్ నిపుణులతో అనుచితంగా ప్రవర్తించినట్లు ప్రొఫెసర్ రాజీవ్ కుమార్‌పై ఆరోపణలు వచ్చాయి. తమపై వ్యక్తిగత ఆరోపణలు చేశారని ఆ ఇద్దరు ఫిర్యాదు చేశారు. అయితే వీరిలో ఒకరు ఫిర్యాదును వెనక్కుతీసుకున్నారని రాజీవ్ కుమార్ తెలిపారు. మరొకరు రిటైర్డ్ సభ్యుడని, ఆ సమావేశానికి హాజరయ్యేందుకు అతనికి అర్హత లేదని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి పలుమార్లు లేఖలు రాసినా .. సమాధానం రాలేదని అన్నారు. ఈ విషయంపై స్టేటస్ రిపోర్ట్ కోరుతూ అవసరమైన చర్య కోసం రాష్ట్రపతి తన లేఖను విద్యా శాఖ, యూనివర్శిటీ యాజమాన్యానికి పంపినట్లు రాష్ట్రపతి కార్యాలయం పేర్కొందని అన్నారు. రాష్ట్రపతి నుండి సమాధానం కోసం వేచి చూస్తున్నానని తెలిపారు.



## సెవాస్టోపోల్ షిప్‌యార్డ్‌పై ఉక్రెయిన్ దాడి

- రెండు భారీ నౌకలు ధ్వంసం

**టి మీడియా, సెప్టెంబర్ 13,మాస్కో:**

రష్యాలోని క్రిమియా ద్వీపకల్పంలోని సెవాస్టోపోల్ షిప్‌యార్డ్‌పై బుధవారం తెల్లవారుజామున ఉక్రెయిన్ దాడి చేసింది. ఈ ఘటనలో రెండు భారీ నౌకలు ధ్వంసం కాగా, సుమారు 24 మందికి గాయాలైనట్లు రష్యా అధికారులు తెలిపారు. 2014లో ఉక్రెయిన్ నుండి రష్యా క్రిమియాను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. గత 18 నెలలుగా రష్యా ఉక్రెయిన్‌పై చొరబాటు చర్యలు చేపట్టినప్పటి నుండి క్రిమియాను లక్ష్యంగా చేసుకుందని అన్నారు. అయితే ఇటీవల దాడుల్లో ఇదే అతిపెద్దదని పేర్కొన్నారు. షిప్‌యార్డ్‌పై ఉక్రెయిన్ సుమారు 10 క్రూయిజ్ క్షిపణులను ప్రయోగించినట్లు రష్యా రక్షణ శాఖ తెలిపింది. అలాగే నల్లసముద్రంపై నుండి మూడు సముద్ర డ్రోన్‌లను నౌకలపై ప్రయోగించిందని పేర్కొంది. ఏడు క్షిపణులతో పాటు అన్ని సముద్ర డ్రోన్‌లను కూల్చివేశామని.. అయితే కొన్ని క్షిపణులు నౌకలను ధ్వంసం చేశాయని తెలిపింది. అయితే ఈ దాడిపై ఉక్రెయిన్ అధికారులు స్పందించలేదు. ఈ దాడిలో 24 మందికి గాయాలయ్యాయని సెవాస్టోపోల్ గవర్నర్ మైఖేల్ రజ్వోజాయేవ్ బుధవారం టెలిగ్రామ్‌లో పేర్కొన్నారు. దాడికి సంబంధించిన ఫోటోలను కూడా పోస్ట్ చేశారు.

## ఎంతో ఎత్తు గోడలు, మరెంతో భద్రత ఉన్న జైల్లోనే మొద్దుశీనును చంపారు

- చంద్రబాబు సెక్యూరిటీపై పరిటాల సునీత

**టి మీడియా, సెప్టెంబర్ 13,అనంతపురం :**



జైలులో రకరకాల వ్యక్తులుంటారు. అక్కడ పరిస్థితులు వేరుగా ఉంటాయి. అలాగే చంద్రబాబుకు కూడా ఏమైనా జరుగుతుందేమోనన్న భయం ఉంది. స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్ లో అరెస్ట్ అయిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో ప్రస్తుతం ఆయన రాజమండ్రి సెంట్రల్ జైల్లో ఉంటున్న సంగతి తెలిసిందే. అయితే జైల్లో చంద్రబాబు భద్రతపై టీడీపీ నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జైల్లో చంద్రబాబు సెక్యూరిటీపై భయాందోళనలు వ్యకం చేస్తున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైల్లో చంద్రబాబును ఉంచడం అంత సేఫ్ కాదంటున్నారు. అక్కడ చంద్రబాబుకి ప్రాణహాని ఉందని ఆరోపిస్తున్నారు. తాజాగా ఇదే విషయమై టీడీపీ సీనియర్ నేత, మాజీమంత్రి పరిటాల సునీత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంతో ఎత్తు గోడలు, మరెంతో భద్రత ఉన్న అనంతపురం జిల్లా జైల్లోనే మొద్దుశీనును మర్డర్ చేశారు అని పరిటాల సునీత గుర్తు చేశారు. మొద్దుశీనును ఎంతో భద్రత ఉన్న జిల్లా జైలులోనే చంపారు. చంద్రబాబుకు జైల్లో భద్రతపై అనుమానాలు ఉన్నాయి. అధికారులు గోడల ఎత్తు గురించి మాట్లాడుతున్నారు. అంతే ఎత్తు ఉన్న అనంతపురం జిల్లా జైలులో మొద్దుశీనును చంపారు. ఈ విషయం మర్చిపోకండి. జైల్లో రకరకాల వ్యక్తులుంటారు. అక్కడ పరిస్థితులు వేరుగా ఉంటాయి. అలాగే చంద్రబాబుకి కూడా ఏమైనా జరుగుతుందేమోనన్న భయం ఉంది" అని మాజీమంత్రి పరిటాల సునీత అనుమానం వ్యక్తం చేశారు. చంద్రబాబు హౌస్ రిమాండ్ కోసం వేసుకున్న పిటిషన్ ను ఏసీబీ కోర్టు తిరస్కరించిన సంగతి తెలిసిందే. చంద్రబాబుకి ఇంట్లో కన్నా జైల్లో ఎక్కువ భద్రత ఉంటుందని, జైల్లోనే చంద్రబాబు మరింత సేఫ్ గా ఉంటారని సీఐడీ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి చేసిన వాదనలతో ఏకీభవించిన కోర్టు.. చంద్రబాబు హౌస్ రిమాండ్ పిటిషన్ ను కొట్టివేసింది. చంద్రబాబు ఒక భద్రమైన కోటలో ఉన్నారని పొన్నవోలు సుధాకర్ రెడ్డి తెలిపారు. రాజమండ్రి జైల్లో చంద్రబాబు ఉంటున్న ప్రాంతాన్ని జైలు అధికారులు ఒక కోటలా మార్చేశారని, ఎవరూ ఊహించని రేంజ్ లో చంద్రబాబుకి భద్రత కల్పించారని ఆయన చెప్పారు. జైల్లో చంద్రబాబు భద్రత మా ప్రభుత్వం బాధ్యత అన్నారు. చంద్రబాబు సెక్యూరిటీ గురించి ఎవరికీ ఎలాంటి అనుమానాలు అవసరం లేదని, ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. చంద్రబాబు భద్రత విషయంలో ఏమైనా పొరపాట్లు జరిగితే దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని, అందుకే టైట్ సెక్యూరిటీ కల్పించామని లాయర్ పొన్నవోలు సుధాకర్ వెల్లడించారు.



## 40 శాతం ఎంపిలపై క్రిమినల్ కేసులు

**ఎడిఆర్ నివేదిక**

**మీడియా సెప్టెంబర్ 13,న్యూఢిల్లీ :**

పార్లమెంట్ ఉభయ సభల్లోని 40 శాతం మంది సిట్టింగ్ ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎడిఆర్ సంస్థ వెల్లడించింది. ఇందులో 25 శాతం మందిపై (194 మంది ఎంపీలు) హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన కేసులు ఉన్నాయని పేర్కొంది. నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థతో కలిపి సిట్టింగ్ ఎంపీల అఫిడవిట్‌లను పరిశీలించి, వివరాలను వెల్లడించింది. ఉభయ సభల్లో 776 మంది ఎంపీలు ఉండగా, 763 మంది ఎంపీల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించింది. 763 మంది ఎంపీల్లో 306 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. ఇరుసభల్లోని ఎంపీల సగటు ఆదాయం రూ.38.33 కోట్లుగా ఉంది. ఇందులో 53 మంది అంటే 7 శాతం మంది బిలియనీర్లు. ఉభయ సభల్లో క్రిమినల్ కేసులు నమోదైన వారిలో రాష్ట్రాలవారీగా చూస్తే కేరళ నుంచి 29 మంది ఎంపీలకు గాను 23 మందిపై (79 శాతం), బీహార్ నుంచి 56 మందికి గాను 41 (73 శాతం), మహారాష్ట్ర నుంచి 65 మందికి 37 (57 శాతం), తెలంగాణ నుంచి 24 మందికి గాను 13 (54 శాతం), ఢిల్లీ నుంచి 10 మందికి గాను 5గురిపై (50 శాతం) క్రిమినల్ కేసులు ఉన్నాయి. తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్న వారిలో బీహార్ నుంచి 28 మంది, తెలంగాణ నుంచి 9 మంది, కేరళ నుంచి 10 మంది, మహారాష్ట్ర నుంచి 22 మంది, ఉత్తర ప్రదేశ్ నుంచి 37 మంది ఉన్నారు. బిజెపి నుంచి 139 మంది, కాంగ్రెస్ నుంచి 43 మంది, టిఎంసి నుంచి 14 మంది, ఆర్‌జెడి నుంచి ఐదుగురు, వైసిపి నుంచి 13 మంది క్రిమినల్ కేసులు కలిగి ఉన్నారు. పార్టీల వారీగా చూస్తే బిజెపి నుంచి 98 మంది (25 శాతం), కాంగ్రెస్ నుంచి 26 మంది (32 శాతం), టిఎంసి నుంచి ఏడుగురు (19 శాతం), ఆర్‌జెడి నుంచి ముగ్గురు (50 శాతం), ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి ఒకరు (9 శాతం), వైసీపీ నుంచి 11 మంది (35 శాతం), ఎన్‌సిపి నుంచి 2 (25 శాతం) తీవ్రమైన క్రిమినల్ కేసులు కలిగి ఉన్నారు. ఇక ఎంపీల ఆస్తుల విషయానికి వస్తే తెలంగాణ 24 మందితో మొదటి స్థానంలో ఉంది. సగటు ఆస్తి రూ.262.26 కోట్లుగా ఉంది. ఆ తర్వాత మధ్యప్రదేశ్ నుంచి 36 మంది (సగటున రూ.150.76 కోట్లు), పంజాబ్ 20 మంది (సగటున 88.94 కోట్లు) ఉన్నారు. అందరి కంటే తక్కువగా లక్షద్వీప్ ఎంపీ రూ.9.38 లక్షలతో చివరి స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత త్రిపుర ముగ్గురు ఎంపీల సగటు ఆస్తి రూ.1.09 కోట్లు, మణిపూర్ నుంచి ముగ్గురి సగటు ఆస్తి రూ.1.12 కోట్లుగా ఉంది. బిజెపి ఎంపీల సగటు ఆస్తి రూ.18.31 కోట్లు, కాంగ్రెస్ ఎంపీల సగటు ఆస్తి రూ.39.12 కోట్లు, టిఎంసి ఎంపీల సగటు ఆస్తి రూ.8.72 కోట్లు, వైసిపి ఎంపీల సగటు ఆస్తి రూ.153.76 కోట్లు, టిఆర్ఎస్ ఎంపీల సగటు ఆస్తి రూ.383.51 కోట్లు, ఎన్‌సిపి ఎంపీల సగటు ఆస్తి రూ.30.11 కోట్లు, ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సగటు ఆస్తి రూ.119.84 కోట్లుగా ఉంది. 53 మంది బిలియనీర్ ఎంపీల లో తెలంగాణ నుంచి ఏడుగురు, ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మంది, ఢిల్లీ నుంచి ఇద్దరు, పంజాబ్ నుంచి నలుగురు, ఉత్తరాఖండ్ నుంచి ఒకరు, మహారాష్ట్ర నుంచి ఆరుగురు, కర్ణాటక నుంచి ముగ్గురు ఉన్నారు. వీరంతా రూ.100 కోట్లకు పైగా ఆస్తిని కలిగి ఉన్నారు. రూ.100 కోట్ల ఆస్తిని కలిగి ఉన్న ఎంపీలలో బిజెపి నుంచి 14 మంది, కాంగ్రెస్ నుంచి ఆరుగురుఉన్నరు.

## కాశ్మీర్ యాపిల్ రైతులపై కేంద్రం కక్షసాధింపు

- అమెరికా యాపిల్స్‌పై సుంకం తగ్గింపు
- పెట్టుబడులూ దక్కవంటున్న రైతులు

**టి మీడియా, సెప్టెంబర్ 13తో శ్రీనగర్ :**



జమ్ముకాశ్మీర్‌లో యాపిల్ పంట దిగుమతి కాలం సమీపిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అక్కడి రైతులపై పిడుగులా పడింది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే యాపిల్స్‌పై టారిఫ్‌ను 20 శాతాన్ని కేంద్రం తగ్గించడం జమ్ముకాశ్మీర్ రైతులకు అశనిపాతంగా మారనుంది. ఇప్పటికే పంట సాగు వ్యయం పెరగడం, ప్రభుత్వం నుంచి సబ్సిడీలు లేకపోవడం, సరైన మద్దతు ధర లేకపోవడం, దళారుల దోపిడీ, అననకూల వాతావరణ పరిస్థితులు, తెగుళ్లు వంటి వాటితో కష్టాలు పడుతున్న రైతులు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఉక్కిరిబిక్కిరి కానున్నారు.

ప్రీమియమ్ వాషింగ్టన్ యాపిల్స్‌పై 2019 నుంచి అమల్లో ఉన్న 70 శాతం సుంకంలో 20 శాతం తగ్గిస్తున్నట్లు ఈ ఏడాది జూన్‌లో అమెరికా పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు. తాజాగా న్యూఢిల్లీలో జరిగిన జి-20 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మోడీ - బైడెన్ ద్వైపాక్షిక సమావేశానికి ముందు దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఈ నిర్ణయం ఈ నెల 5 నుంచి అమల్లోకి వచ్చింది. యాపిల్స్, వాల్‌నట్స్, లెంటిల్స్, చిక్‌పీస్ వంటి అనేక అమెరికా ఉత్పత్తులపై ఈ నోటిఫికేషన్ పన్ను మినహాయింపులను ప్రకటించింది. జమ్ముకాశ్మీర్‌కు చెందిన యాపిల్ తోటల పెంపకందార్లు, వ్యాపారుల సమాచారం ప్రకారం రాష్ట్రంలో యాపిల్ పంట చేతికొచ్చే సమయంలోనే వాషింగ్టన్ యాపిల్స్ కూడా మార్కెట్లోకి వస్తాయి. ఇది స్థానిక పరిశ్రమను తీవ్రంగా దెబ్బతీస్తుంది. జమ్ముకాశ్మీర్ యాపిల్ పరిశ్రమపై ఆధారపడి సుమారు 30 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. వీరిపై కేంద్ర నిర్ణయం ప్రతికూల ప్రభావం చూపనుంది.

## నా మిత్రుడు పోరాటయోధుడు

## ధైర్యంగా ఉండండి

- నారా లోకేష్‌కు రజనీకాంత్ ఫోన్

**టి మీడియా, సెప్టెంబర్ 13,చెన్నై:**



టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు స్కిల్ డెవలప్ మెంట్ కేసులో కడిగిన ముత్యంలా తిరిగివస్తారని సూపర్ స్టార్ రజనీకాంత్ అన్నారు.. రిమాండ్ ఖైదీగా చంద్రబాబు ప్రస్తుతం రాజమండ్రి జైలులో నేపథ్యంలో, నారా లోకేశ్ కు దక్షిణాది సూపర్ స్టార్ రజనీకాంత్ ఫోన్ చేసి పరామర్శించారు. ఇలాంటి సమయాల్లో ధైర్యంగా ఉండాలని సూచించారు. తన మిత్రుడు చంద్రబాబు గొప్ప పోరాట యోధుడు అని, ఆయన చేసిన అభివద్ధి, సంక్షేమమే ఆయనకు రక్ష అని ఈ సందర్భంగా రజనీకాంత్ పేర్కొన్నారు. చంద్రబాబు ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పరితపించే గొప్ప నేత అని కొనియాడారు. ఈ తప్పుడు కేసులు అక్రమ అరెస్టులు ఆయనని ఏం చేయలేవని రజనీకాంత్ ధీమా వ్యక్తంచేశారు. తనకు ఆత్మీయ మిత్రుడైన చంద్రబాబు తప్పు చేయరని, చేసిన మంచి పనులు, నిస్వార్థమైన ప్రజా సేవ, ఆయనను క్షేమంగా బయటకు తీసుకొస్తాయని పేర్కొన్నారు.

# ఆస్తి కాజేశారు

- పోలీసులను ఆశ్రయించిన నటి గౌతమి

**మీడియా సెప్టెంబర్ 13,చెన్నై :**



తన నుండి రూ.25 కోట్ల విలువైన ఆస్తిని కాజేశారని.. అడిగితే నిన్ను, నీ కూతురిని చంపేస్తామంటూ బెదిరిస్తున్నారని సీనియర్ నటి గౌతమి చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. ఈమేరకు వివరాలు సేకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.వివరాల్లోకెళితే ... గౌతమికి శ్రీపెరుంబూర్ సహా తమిళనాడులోని పలు ప్రాంతాల్లో రూ.46 కోట్ల విలువైన స్థిరాస్తులున్నాయి. అయితే తన అనారోగ్యం కారణంగా కొన్ని ఆస్తులను అమ్మేయాలనుకున్న గౌతమి ... ఆ పనిని అలగప్పన్ అనే ఏజెంట్‌కు అప్పజెప్పారు. కానీ ఆ ఆస్తిపై కన్నేసిన అలగప్పన్ ఫోర్జరీ సంతకాలు, నకిలీ పత్రాల సాయంతో దాన్ని కాజేశాడు. ఇదేమిటీ అని గౌతమి ప్రశ్నించగా ... రాజకీయ అండతో నటిని, ఆమె కూతురిని చంపేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో గౌతమి పోలీసులను ఆశ్రయించారు. తన నుంచి కాజేసిన రూ.25 కోట్ల విలువైన స్థలాన్ని తిరిగి తనకు అప్పజెప్పాలని పోలీసులను అభ్యర్థించారు. తనపై బెదిరింపులకు పాల్పడుతున్న అళగప్పన్‌పై చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమస్యల వల్ల తన కూతురి చదువు కూడా డిస్టర్బ్ అవుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గౌతమి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# అర్ధరాత్రి ఒంటి గంట వరకు మెట్రో సేవలు

**టి మీడియా ,సెప్టెంబర్ 13హైదరాబాద్ :**



వినాయక నవరాత్రులకు హైదరాబాద్ నగరం సిద్ధమవుతోంది. ఇక ఖైరతాబాద్ వినాయకుడిని దర్శించుకునేందుకు యాత్రికులు నగరం నలుమూలల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలపై కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి కూడా తరలివస్తుంటారు. ఈ క్రమంలో యాత్రికులను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ మెట్రో కీలక నిర్ణయం తీసుకుంది.వినాయక నవరాత్రుల సందర్భంగా అర్ధరాత్రి ఒంటి గంట వరకు మెట్రో రైళ్లను నడిపేందుకు యోచిస్తున్నట్లు మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఖైరతాబాద్ గణేశ్‌ను దర్శించుకునే భక్తులను దష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ స్టేషన్‌లో అదనపు టికెట్ కౌంటర్లను ఓపెన్ చేస్తామన్నారు. యాత్రికులు వీలైనంత త్వరగా టికెట్ పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఖైరతాబాద్ మెట్రో స్టేషన్ వద్ద అదనపు భద్రతను ఏర్పాటు చేస్తామన్నారు.

# ఆర్టీసీ బస్సుల్లో నగదు రహిత ప్రయాణం

## బండ్లగూడ డిపోలో అమలు

**టి మీడియా ,సెప్టెంబర్ 13,హైదరాబద్ :**

ఆర్టీసీలోని అన్ని రకాల బస్సుల్లో త్వరలో నగదు రహిత చెల్లింపుతో ప్రయాణం చేసే వెసులుబాటు రానుంది. పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ సహా ఆపై స్థాయి బస్సులన్నింటిలోనూ ఐ-టిమ్స్ పరికరాలను అందుబాటులోకి తేనున్నారు. దీంతో డెబిట్, క్రెడిట్ కార్డులతో పాటు గూగుల్ పే, ఫోన్ పే వంటి వాటితో ప్రయాణికులు తమ టికెట్ ధరను చెల్లించి, బస్సుల్లో ప్రయాణించొచ్చు.ఈ మేరకు బండ్లగూడ బస్‌డిపోను ఆర్టీసీ అధికారులు పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. డిపోలోని ఆర్డినరీ, మెట్రో సహా మొత్తం 145 బస్సుల్లో ఐ-టిమ్స్‌ను వాడేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బండ్లగూడ డిపోలో అమలు చేసిన అనంతరం కంటోన్మెంట్ డిపోలో అమలు చేయనున్నారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 8,300 బస్సుల్లో దశల వారీగా ప్రవేశపెట్టేలా కార్యాచరణ రూపొందించారు.

# వివేకా హత్య కేసులో ఉదయ్ కుమార్ రెడ్డికి ఎస్కార్ట్ బెయిల్

**టి మీడియా ,సెప్టెంబర్ 13హైదరాబాద్:**



మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో నిందితుడిగా ఉన్న ఉదయ్ కుమార్ రెడ్డికి సీబీఐ కోర్టు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 14వ నుంచి 16వ తేదీ వరకు ఉదరు కుమార్ రెడ్డిని ముగ్గురు కానిస్టేబుళ్లు వాహనంలో తీసుకెళ్లాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాకపోకలకు అయ్యే ఖర్చును మొత్తం ఉదయ్ కుమార్ రెడ్డి భరించాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. అయితే, ఉదయ్ కుమార్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై సీబీఐ కోర్టులో ఈ నెల 11న వాదనలు పూర్తయ్యాయి. తన భార్య గర్భవతిగా ఉందని, 15 రోజుల మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోర్టును ఉదరు కుమార్ రెడ్డి కోరారు. తన భార్యను చూసుకోవడానికి ఎవరూ లేరని కోర్టుకు తెలిపారు. సీబీఐ తరఫు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ బెయిల్ ఇవ్వొద్దని కోర్టుకు వివరించారు. ఈ కేసులో ఆరో నిందితుడిగా ఉన్న ఉదయ్ కుమార్ రెడ్డికి వివేకా హత్య గురించి ముందే తెలుసని.. ఈ మేరకు తన తల్లికి ఈ విషయం చెప్పినట్లు పీపీ కోర్టుకు తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయస్థానం ఈ నెల 11న తీర్పును రిజర్వు చేసింది. తాజాగా ఎస్కార్ట్ బెయిల్‌ను మంజూరు చేసింది.